## క్లుప్తంగా

### డప్పు కళాకారులకు దుస్తులు పంపిణీ



**తాడికొండ:** తాడికొండ గ్రామానికి చెందిన పది మంది డప్పు కళాకారులకు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈనెల 27న నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని ముందస్తుగా పంపిణీ చేశారు. డప్పు కళాకారులు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వలన కళాకారుల డ్రస్సు కుట్టించుకోలేకపోయామని, ఈ విషయాన్ని సురేష్ కుమార్‌కు తెలియజేయడంతో వెంటనే స్పందించి వాటిని ఏర్పాటు చేశారని తెలిపారు. తమకు డ్రెస్ ఇచ్చినందుకు కత్తెర దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

### రేపు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

**మంగళగిరి:** వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం నగరంలోని మిద్దె సెంటర్‌లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను వినియోగించుకోవాలని రోటరీ క్లబ్ ప్రతినిధులు కోరారు.

### మట్టి వినాయక ప్రతిమల తయారీపై శిక్షణ



**ఫిరంగిపురం:** మండలంలోని వేమవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం వినాయకుడి మట్టి ప్రతిమల తయారీపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం డి.కమల్‌మోహన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. మట్టి ప్రతిమలు ఎలా తయారుచేసుకోవాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.శివకుమారి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పి.రామిరెడ్డి, ఉపాధ్యాయుడు రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులు చట్టాలను గౌరవించాలి

**ఫిరంగిపురం:** విద్యార్థులు చట్టాన్ని గౌరవించాలని ఎస్‌ఐ చల్లా కిషోర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌సీజేసీ, సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్, సైబర్ క్రైమ్, చట్టం వీటి గురించి వివరించారు. పరీక్ష సమయాల్లో ఎటువంటి జాగ్రత్తలు పాటిస్తే మంచి మార్కులు సాధించవచ్చునో వివరించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకొని ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముగిసిన విద్యుత్ వినియోగదారుల అదాలత్



**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. అమరావతి విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.వి. తులసిరామ్ మాట్లాడుతూ ఈ సదస్సులో మొత్తం 17 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 15 అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన రెండు ఫిర్యాదులు 15 రోజులలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదాలత్‌లో విద్యుత్ అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

### ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

**మేడికొండూరు:** ఎస్టీయూ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల పరిధిలోని డోకిపర్రు గ్రామంలో శనివారం ఎస్టీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షులు డి.పెద్దిబాబు పాల్గొన్నారు. మండల అధ్యక్షులుగా గుండిగ జోజప్ప, ప్రధానకార్యదర్శి ఎస్ శివారామయ్య, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.కె.అజీజ్, గౌరవ అధ్యక్షులు జి.మల్లేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులుగా సుబ్బారావు, అదనపు కార్యదర్శిగా బండి శ్రీను, వైస్ ప్రెసిడెంట్‌గా సురేష్, జిల్లా కౌన్సిలర్‌గా కొండలరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆర్థిక సభ్యులు వాసిమళ్ల ప్రసాద్, జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ షేక్ బాజిలు పరిశీలకులుగా వ్యవహరించారు.

# ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు
- జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, డీఎంహెచ్‌ఓ ఎ శ్రావణ్‌బాబు, కమిషనర్ శారదాదేవి

**మంగళగిరి:** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆర్కే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే విద్య, వైద్యరంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. యావత్ భారత దేశం రాష్ట్రం వైపు చూసేలా సుపరిపాలన అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన విద్య, వైద్యం అందించాలన్న అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన అందించడం జరుగుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా విద్య, వైద్య వ్యవస్థకు ప్రభుత్వం వేల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఆరోగ్యశాఖకు సంబంధించి భారీస్థాయిలో నియామకాలు జరిగాయని, ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే వారికి మెరుగైన సేవలు అందించడం తోపాటు శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఆసుపత్రులకు పంపాలన్నారు. రానున్న 15 రోజుల్లో నిర్వహించే ఇంటింటా సర్వే కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో తొమ్మిది వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. టీబీ రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌ఓ ఎ శ్రావణ్‌బాబు, డీపీఎంఓ సీహెచ్ రత్నమన్మోహన్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ బి లక్ష్మానాయక్, ఎన్‌టీబీపీ జిల్లా కోఆర్డినేటర్ వి రాజశేఖరం, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి మీఎస్‌ఆర్ శాస్త్రి, కమిషనర్ యు శారదాదేవిలతో పాటు యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్, తహసీల్దార్ పద్మనాభుడు

**జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యానికి భద్రత**

**ఫిరంగిపురం:** జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి యానీగ్రేస్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్యసురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమం ప్రారంభించారు. యానీ గ్రేస్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బందిని రెండు విభాగాలుగా ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చిందా, రక్తం తక్కువగా ఉన్నవారి వివరాలు, బీపీ, షుగర్ ఉన్నవారి వివరాలు, కంటివెలుగులో పరీక్షలు చేయించుకున్నదీ లేనిదీ వంటి పూర్తి వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనారోగ్య సమస్యలున్న వారికి టోకెన్లు అందజేసి ఎప్పుడు గ్రామంలో నిర్వహించే వైద్యశిబిరం వివరాలు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎం రోజమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**సర్వేవివరాలు పరిశీలన**

మండలంలోని పొనుగుపాడులో ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శనివారం ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్, తహసీల్దార్ పద్మనాభుడు పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపాక సురేష్

**మంగళగిరి:** ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపాక సురేష్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని అంబేద్కర్ సెంటర్‌లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగ, మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపార్టీల ఎంపీలు పార్లమెంటులో వర్గీకరణపై మాట్లాడి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ చేస్తే మాదిగలలో బీజేపీ చిరస్థాయిగా నిలుస్తుందని, లేదంటే మాదిగ ద్రోహిగా మిగిలిపోతుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చందోలు విక్టర్‌పాల్, కలకోటి నాగేశ్వరరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, నతానియేలు, గుండిమెడ నాగేంద్రం, భాస్కర్, రాజేష్, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

**తాడేపల్లిరూరల్:** కేంద్ర ప్రభుత్వం రానున్న పార్లమెంట్ సమావేశాలలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ అమరావతి రాజధాని పర్యవేక్షకులు మల్లవరపు నాగయ్య డిమాండ్ చేశారు. తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన బీజేపీ 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని ఇంత వరకు అమలు చేయలేదని అన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని క్రిస్టియన్‌పేటలో చిలక సాంబయ్య భూమిని కొంత మంది కబ్జా చేశారని, దళితుడైన సాంబయ్యకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కసుకూర్తి నవీన్, అల్లి అచ్చయ్య, చిలక సాంబయ్య, రామలింగేశ్వరరావు, కొడాలి వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### పంటనమోదు, ఈకేవైసీ చేయించుకోవాలి



**తాడేపల్లిరూరల్:** రైతులు తప్పని సరిగా పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని తెనాలి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.ఉషారాణి అన్నారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఎస్.ఉషారాణి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోపు రైతులు తమ ఆధార్ కార్డును, సాగుచేస్తున్న భూమి వివరాలను సమీప రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.శిరీష, గ్రామ వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో బాలుడు మృతి



మృతి చెందిన బాలుడు షాహిన్

**మేడికొండూరు:** బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల పసిబాలుడు మృతిచెందిన ఘటన మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్లలో శనివారం చోటుచేసుకుంది. మేడికొండూరు సీఐ వాసు తెలిపిన వివరాల మేరకు... పేరేచర్ల జంక్షన్‌లోని సెక్రెడ్ హార్ట్ పాఠశాల సమీపంలో రెండు సంవత్సరాల బాలుడు రోడ్డుపై ఆడుకుంటుండగా స్కూల్ బస్సు ఆ జాగ్రత్తగా నడుపుతూ పసి బాలుడిపై బస్సు ఎక్కించాడు. ఈ ఘటనలో బస్సు బాలుని తలపైగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన బాలుడు మండల పరిధిలోని కొర్రపాడు గ్రామానికి చెందిన షేక్ అంజిబాబు కుమారుడు షాహిన్ అని వాసు తెలిపారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి



ఆహార నిపుణురాలికి జ్ఞాపిక అందజేస్తున్న మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు స్థూలకాయం, షుగర్ వ్యాధిపై మహిళా అభివృద్ధి సెల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ ఆధునిక కాలంలో వచ్చిన ఆహారపు అలవాట్ల వలన స్థూలకాయం తోపాటు ఎక్కువ సంఖ్యలో చక్కెర వ్యాధితో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని నిర్వహించినందుకు మహిళా అభివృద్ధి సెల్ కమిటీ సభ్యులను వర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి కోనేరు శివకాంచనలత, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు అభినందించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్, మహిళా అభివృద్ధి సెల్ కో కన్వీనర్లు డాక్టర్ కె.సోని, ఎన్.శ్రీలక్ష్మి, మహిళా అభివృద్ధి సెల్ కో ఆర్డినేటర్ కోనేరు శిరీష, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సుకీర్తి తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో ఉర్దూ డీఐ తనిఖీలు

**మేడికొండూరు:** మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలోని పలు ఉర్దూ పాఠశాలలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి యం.డి.ఖాసీం శనివారం తనిఖీ చేశారు. శనివారం నో బ్యాగ్‌డే సందర్భంగా విద్యార్థులు రుపొందించిన చిత్రపటాలను ఆయన పరిశీలించారు. అనంతరం పిల్లలతో కాసేపు ముచ్చటించి మధ్యాహ్న భోజనం గురంచి వారిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన విషయంలో రాజీ పడకుండా చిన్నారులకు అందించాలని వారికి సూచనలిచ్చారు.

## వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం



దుర్గాకాలనీలో ఏర్పాటుచేసిన చవితి పందిరి



పందిరిలో పెట్టేందుకు తీసుకువచ్చిన వినాయకుడి విగ్రహం

**ఫిరంగిపురం:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని రామాలయం వద్ద, ప్రధాన కూడళ్లలో, సొలస బస్టాండు, విజయదుర్గాకాలనీ, కొత్తపేట, రేపూడి, 113 తాళ్లూరు, తక్కెళ్లపాడు, మేరికపూడి, నుదురుపాడు, యర్రగుంట్లపాడు, మునగపాడు, అల్లంవారిపాలెం, కండ్రిక, గుండాలపాడు గ్రామాల్లో పందిళ్లలో వినాయక విగ్రహాలు పెట్టి తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పందిళ్లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

**చవితి పందిళ్లకు పోలీసు అనుమతి తప్పనిసరి**

పలు గ్రామాల్లో వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని ఎస్‌ఐ చల్లా కిషోర్ తెలిపారు. కమిటీ ఏర్పడి వారి వివరాలు స్టేషన్‌లో తెలిపి గుర్తింపు కార్డులు పొందాలన్నారు. ప్రైవేటు, పంచాయతీ స్థలాలు అయితే వారి అనుమతి తీసుకోవాలన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తీసుకొని ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇసుక, నీరు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. నిమజ్జన సమయంలో వాటి వివరాలు తెలియజేయాలన్నారు. మండపాల వద్ద శబ్ద కాలుష్యం లేకుండా చూడాలని చెప్పారు. ఉదయం ఆరు నుంచి రాత్రి 10గంటల వరకు అనుమతి ఉంటుందని వివరించారు.

### ప్రతిభను వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యం



దుగ్గిరాలలో విద్యార్థులకు ఆట వస్తువులు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

**తాడేపల్లిరూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారని, విద్యార్థుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, శాప్ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలకు ఆట వస్తువులను అందజేస్తోంది. దుగ్గిరాల గ్రామంలో ఉన్న బాలుర, బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలకు శనివారం ఆట వస్తువులు అందజేశారు. ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణలు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రతి పాఠశాలలోను, వాలీబాల్, క్రికెట్, చెస్, కేరమ్స్, బ్యాడ్మింటన్ తదితర ఆట వస్తువులను అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు శాప్ డైరెక్టర్ శైలజ, ఎంఈఓ శ్రీనివాసరావు, దుగ్గిరాల బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మేడికొండూరు:** మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి సిద్ధిక్ అన్నారు. మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్, 104 ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



ఎమ్మెల్సీ హనుమంతరావు

**మంగళగిరి:** నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విఘ్నాలు తొలగి ప్రజలంతా సుఖసంతోషాలు, అష్ట ఐశ్వర్య, ఆరోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. వినాయకుడు దీవెనలతో అందరూ బాగుండాలన్నారు. ప్రజలంతా మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మట్టి గణపతి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

మోతడక చలపతి కళాశాల ప్రిన్సిపల్ కె కిరణ్‌కుమార్



మట్టి గణపతి ప్రతిమలను అందజేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

**మోతడక(తాడికొండ):** మట్టి గణపతి విగ్రహాలను వాడటంపై అవగాహన కల్పించి ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల వినియోగం తగ్గించడం ద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారవుతామని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ అన్నారు. సామాజిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా కళాశాల టెక్నో క్రాట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పర్యావరణ హితంగా వినాయక చవితి పండుగ జరుపుకోవడం వలన కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పించడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించవచ్చన్నారు. స్వచ్ఛమైన నీరు, గాలి, వాతావరణం కాలుష్యం కాకుండా కాపాడాలంటే ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మట్టి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగశ్రీనివాసరావు, జి రామచంద్రరావు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కుంచనపల్లి సర్వీస్ రోడ్‌ను వెంటనే పూర్తిచేయాలి

**తాడేపల్లిరూరల్:** జాతీయ రహదారి నుంచి కుంచనపల్లి గ్రామంలోకి వెళ్లే సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావుతో కలసి అసంపూర్తిగా ఉన్న సర్వీస్‌రోడ్‌ను శనివారం పరిశీలించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో కుంచనపల్లి, వడ్డేశ్వరం, మెల్లెంపూడి తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తాయని అన్నారు. జాతీయ రహదారి అధికారులు రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంతో గుంతలు పడి, వర్షాలు కురిసినపుడు ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. తక్షణం అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

### నేలబావిలో పడి గొర్రెలకాపరి మృతి

**ఫిరంగిపురం:** నేలబావిలో పడి గొర్రెల కాపరి మృతిచెందిన సంఘటన మండలంలోని బేతపూడి గ్రామశివారు పొలాల్లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా కోడూరు మండలం, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన దేవనబోయిన గోపిరాజు(24)గొర్రెలు మేపుకునేందుకు తోటివారితో మండలంలోని బేతపూడి గ్రామ శివారు ప్రాంతానికి వచ్చాడు. గొర్రె ఒకటి మందలో నుంచి తప్పిపోయి నేలబావి సమీపంలోకి వచ్చింది. దానిని తోలేందుకు వెళ్లిన గోపిరాజు నేలబావిలో పడిపోయాడు. కొద్దిసేపటికి తోటి గొర్రెలకాపరులు గోపిరాజు కన్పించడం లేదని చుట్టుప్రక్కల అంతా వెతికారు. అనుమానం రావడంతో గ్రామస్తుల సహకారంతో నేలబావిలోని నీటిని తోడించారు. మృతదేహం కన్పించింది. గొర్రెల కాపరుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా కిషోర్ తెలిపారు.

### చదరంగంలో కేఎల్‌యూ విద్యార్థినికి బంగారు పతకం



మౌనిక అక్షయ

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థిని చదరంగం పోటీల్లో రెండు పతకాలు సాధించినట్లు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 15వరకు జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో టాటా స్టీల్ సంస్థ నిర్వహించిన ఏషియన్ జూనియర్ బ్లిట్జ్ చెస్ చాంపియన్ షిప్‌లో తమ విశ్వవిద్యాలయంలో సీఎస్‌ఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న బొమ్మిని మౌనిక అక్షయ ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుందని తెలిపారు. ఆసియా జూనియర్ బాలికల చెస్ చాంపియన్‌షిప్ 2023లో మౌనిక అక్షయ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నట్లు వివరించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావులు అక్షయను అభినందించారు.